


మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంతో పాటు ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఒకవైపు, విద్యుత్ కోత మరోవైపు ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవ్వగా సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి కుండపోత వర్షం కురిసింది. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కనబడనంత విస్తారంగా వర్షం కురవడంతో ఆ కొద్దిసేపైనా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కుండపోత వర్షంతో రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. ఇటీవల ఇంత భారీ వర్షం కురిసిన దాఖలాల్లేవు. ఎండ వేడిమి నుంచి వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు, గర్భిణీలకు కొంత ఉపశమనం లభించిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

పాలకుల నిర్లక్ష్యం... జిసిసికి శాపం

- శిథిలమైన భవనాలు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- గిరిజనులకు తప్పని దళారుల బెడద

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఆనాటి శ్రీకాకుళం రైతాంగ ఉద్యమ పోరాట ఫలితంగా గిరిజనులకు ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన గిరిజన సహకార సంస్థ నేటి ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం ఉదాసీన వైఖరి కారణంగా నేడు నిర్వీర్యం అయిపోతోంది. ఆదివాసీలు సేకరించిన అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉద్యానవన పంటలను కొనుగోలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని ఉద్దేశ్యంతో గుమ్మలక్ష్మీపురంలో మొదటిసారిగా 1969లో గిరిజన సహకార సంస్థలు ఏర్పాటు చేశారు. దీని పరిధిలో డిఆర్ డిపోలు ఏర్పాటు చేసి గిరిజనులు పండించే అన్ని రకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేవారు. అయితే మొదట్లో జిసిసి లక్ష్యాలు నూటికి నూరు శాతం చేరుకొన్నా ఆ తర్వాత కాలక్రమేణా తగ్గుతూ వస్తున్నాయి. లక్ష్యం కొండంత... కొనుగోలు గోరంత అన్న చందంగా జిసిసి పనితీరు తయారైంది. ఏజెన్సీలో అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆదివాసీలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న జిసిసి లక్ష్యం నీరుగారు తోంది. ఆదివాసీల అభివృద్ధికి సహకారం అందించాల్సిన జిసిసిలో వ్యాపార ధోరణి పెరిగిపోయింది. మరోవైపు అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా పరోక్షంగా ప్రైవేటు వ్యాపారులకు మేలు చేస్తుంది. దీంతో గిరిజనులు దళారుల బారిన పడి దోపిడీకి గురవుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న జిసిసి కార్యాలయం

పార్వతీపురం, సీతంపేట, పాడేరు, రంపచోడవరం, కె ఆర్ పురం, తిరుపతి, శ్రీశైలం, చింతపల్లిలో డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ఆధ్వర్యంలో 40 బ్రాంచ్ కార్యాలయాలు నడుస్తున్నాయి. జిసిసి కార్యాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. సేల్స్ మేన్లు, సిసిపిఎలు, ఇతర సిబ్బంది కొరత వెంటాడుతుంది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురంలో జిసిసి బ్రాంచ్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో 102 డిఆర్ డిపోలు నడుస్తున్నాయి. ప్రతి ఏటా గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులైన చింతపండు, చీపుర్లు, కొండతామర, కరక్కాయలు, నల్లజీడి, రాగులు, నర మామిడి చెక్క ఇలా 32 రకాలకు పైగా అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేసి గిరిజనులను ఆర్థికంగా ఆదుకునేది. నాలుగేళ్ల నుంచి అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు కనుమరుగవుతున్నాయి. ప్రతి ఏటా చింతపండు 5వేల క్వింటాళ్లకు పైగా ఉత్పత్తి అయినప్పటికీ జిసిసి అధికారులు మాత్రం దీనిలో సగం కూడా కొనుగోలు చేయని పరిస్థితి. బయట వ్యాపారులెవరు ఏజెన్సీలోకి రాకుండా ఉండేందుకు కొన్నిచోట్ల చెక్పోస్టులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అటువంటి చర్యలు ఎక్కడా రావడం లేదు. వంగర, నీలకంఠాపురం, తాడికొండ, మొండెంఖల్, గుమ్మలక్ష్మీపురం, దుడ్డుఖల్లు, దేరువాడ, వలస బల్లేరు, గొరడ, గ్రామాల్లో సంతలు జరుగుతుంటాయి. చుట్టుపక్కల కొండలపై గ్రామాల్లోని గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులు తెచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఇలాంటి చోట జిసిసి అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే గిరిజనులకు కొంత ఆదాయంతో పాటు దళారుల బెడద తప్పుతోంది. ఆ దిశగా అధికారులు చర్యలు శున్యం.

జిసిసిని బలోపేతం చేయాలి

గిరిజనులకు ఉపాధి, సంక్షేమ, ఆర్థిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థను బలోపేతం చేయాలి. జిసిసి కొనుగోలుతో అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి. బయట మార్కెట్లో చింతపండు ధర కేజీ రూ.100 ఉంటే జిసిసి మాత్రం రూ. 40లోపు కొనుగోలు చేయడం విచారకరం. గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు స్పందించి కనీస మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి.

కోలక అవినాష్
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

అటవీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

గిరిజనులు పండించి, సేకరించే 32 రకాల అటవీ ఉత్పత్తులకు జిసిసి ప్రాధాన్యత ఇచ్చి కొనుగోలు చేయాలి. జిసిసి మద్దతు ధర ఇవ్వకుంటే గిరిజనులకు న్యాయం జరగదు. సంస్థ నిలబడాలంటే ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించాలి. ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి పూర్తిస్థాయిలో కొనాలి.

మండంగి రమణ
కురుపాం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి.



ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిపోతున్న చింతపండు

ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లాలో పెద్ద ఇసుక రీచ్‌గా గుర్తింపు పొందిన కూనేరు రామభద్రపురం ఇసుక రీచ్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు ఎస్పీ విక్రాంత్ పాటిల్, వివిధ శాఖల అధికారులు ఇసుక రీచ్‌ను సందర్శించారు. గతంలో ఇసుక రీచ్ నిర్వహణను జెపి సంస్థకు ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే. సుమారు ఏడున్నరేళ్ల పాటు ఈ సంస్థ ఇసుక తవ్వకాలు జోరుగా చేసింది. అనంతరం వేరే సంస్థ తమకు అనుమతులున్నాయంటూ ఐదునెలల క్రితం ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టగా, టిడిపి, జనసేన నాయకులు అడ్డుకొని అనుమతులు చూపించాలని ఆందోళన చేపట్టారు. దీంతో ఇసుక రీచ్‌కు పూర్తి అనుమతుల్లేవంటూ తెలియడంతో నిలిపివేశారు. అనంతరం నాలుగునెలల తర్వాత మంగళవారం కలెక్టర్‌తో పాటు ఎస్పీ, ఇరిగేషన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు, జిల్లా రవాణా శాఖ అధికారులు మైనింగ్ శాఖ అధికారులు పలు శాఖ అధికారులు హడావిడిగా ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్ సర్వే విభాగం అధికారులను ఇసుక రీచ్ వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల నిర్వహణపై కోట్లాది రూపాయలు అక్రమాలు జరిగినట్లు వివిధ పార్టీల నాయకులు గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు సుప్రీంకోర్టులో కేసులు నమోదు చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.10వేల కోట్లు వరకు ఇసుక తవ్వకాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్లు ప్రస్తుతం ఇసుక రీచ్ వద్ద తవ్వకాలు జరుగుతున్నాయా లేదా ఇప్పటి వరకు ఏ మేరకు ఇసుక తవ్వకాలు జరిగాయన్న నివేదికలు పంపించాలని ఆదేశాల మేరకు అధికారుల బృందం పర్యటించినట్టు సమాచారం.



కూనేరు రామభద్రపురంలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, జిల్లా అధికారులు

జియ్యమ్మవలస : మండలంలో ఇప్పటి వరకూ అడ్డూ అదుపూ లేకుండా ట్రాక్టర్లతోను, నాటుబళ్లతో ఇసుక తరలింపు జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల అధికార యంత్రాంగం ఇసుక తరలింపుపై దృష్టి సారించింది. ఈ మేరకు తహశీల్దార్ సీతారామయ్య, చినమేరంగి ఎస్సై చిన్నమనాయుడు, కురుపాం ఎస్సై షణ్ముఖ రావు తమ సిబ్బందితో కలిసి బిత్రపాడు ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోనినాలుగు ఇసుక రీచ్‌లను తహశీల్దార్ జివి జనార్ధన్, ఎస్సై పాపారావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని అరసాడ, నారాయణపురం, గళావిల్లి, వంతరాం పరిధిలో ఉన్న ఇసుక రీచులను కోర్టు ఆదేశాల ప్రకారం తనిఖీలు చేశామన్నారు. అక్కడ ట్రాక్టర్లతో గానీ, బళ్లతో గానీ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులకు అవసరమైతే సంబంధిత పంచాయతీ కార్యదర్శి నుంచి అనుమతి పత్రాలను పొందాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్, విఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఇసుక రీచ్‌లను స్థానిక తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై ఎం.రాజేష్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని బూర్జ, పెదబోగిలిలో ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతుల్లేకుండా ఇక ఇసుక ఎవరైనా తీసుకువెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతుల్లేకుండా ఇసుక తీసుకువెళ్లకూడదన్నారు. కొన్ని గ్రామాల్లో రీచ్‌ల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాబోయే ఖరీఫ్ సీజన్లో జిల్లాలోని రైతులకు పంపిణీ చేసేందుకు 29,283 క్వింటాళ్ల విత్తనాలను (అపరాలు, చోడి, వేరుశనగ, వరి) రాయితీపై ఆర్‌బికెల వద్ద రైతులకు అందించేందుకు సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. 29,283 క్వింటాళ్ల విత్తనాల్లో 9981 క్వింటాళ్ల విత్తనాలను షెడ్యూల్డ్ మండలాల్లో గిరిజన రైతులకు 90శాతం రాయితీపై సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాబోయే ఖరీఫ్‌లో వరి సుమారు లక్షా 75వేల ఎకరాల్లో సాగవుతుందని, దీనికి అవసరమైన 26,416 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ కోసం సిద్ధం చేశామన్నారు. గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు, సీతంపేట మండలాల్లో గిరిశిఖర గ్రామాల్లో చిరు ధాన్యాల సాగును పెద్ద ఎత్తున చేపట్టేందుకు గానూ, రైతులకు కావాల్సిన దాదాపు 110 క్వింటాళ్ల చిరు ధాన్యాల విత్తనాలను 90శాతం రాయితీపై సరఫరా చేయడానికి సిద్ధం చేశామని తెలిపారు. అలాగే తొలకరిలో ఖరీఫ్ పంటకు ముందుగా సాగు చేసి పచ్చిరొట్ట పంటల విత్తనాలైన కట్టిజనుము 820-క్వింటాళ్లు, పిల్లిపెసర-63 క్వింటాళ్లు, జీలుగ-1488 క్వింటాళ్లు విత్తనాలు జిల్లాకు కేటాయించగా (మొత్తంగా 2371 క్వింటాళ్లు), ఇప్పటికే దాదాపు 1300 క్వింటాళ్ల విత్తనాలను ఆర్బీకేలకు తరలించామని తెలిపారు. మరో వారం రోజుల్లోగా మిగిలిన విత్తనాలను ఆర్బీకేలకు పూర్తి స్థాయిలో చేరవేస్తామన్నారు. వీటితో పాటు కంది 197 క్వింటాళ్లు, అపరాలు 47 క్వింటాళ్లు, వేరుశనగ 206 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేను సంప్రదించి, డీ - కృషి అప్ (బయోమెట్రిక్ విధానం) ద్వారా వారి వివరాలు రిజిస్టర్ చేసుకొని, రైతు వాటా చెల్లించాక వారికి విత్తనాలను సదరు ఆర్‌బికె వద్దనే సరఫరా చేస్తున్నామని తెలిపారు. నిబంధనల మేరకు ఎకరా భూమి గల రైతుకు ఒక ప్యాకెట్ వరి (20 కేజీ) విత్తనం సరిపోతుందని, కనుక గరిష్టంగా ఐదు ఎకరాల వరకు ఒక రైతుకు 5 బ్యాగుల విత్తనాలు సరఫరా చేస్తామని చెప్పారు. ఈ ఏడాది కూడా రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలను, కావాల్సినంత పరిమాణంలో ఆర్బీకే ల వద్ద సీజన్లో ప్రారంభం కాక ముందే తరలించి సిద్ధం చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

జిల్లా వ్యవసాయాధికారి

అద్దె గోల్‌మాల్‌పై విచారణ ఏమైందో?

వాస్తవాలు దాచి పెట్టే యత్నంలో అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో 20 నెంబర్ షాపు అద్దె గోల్ మాల్ వ్యవహారంపై ఇంతవరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఈ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేది బయటకు రావడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న 20 నెంబర్ షాపును వాస్తవంగా అద్దెకిచ్చి రికార్డుల్లో ఖాళీగా ఉందని చూపడం వెనుక ఆంతర్యమేమిటనేది అంతు చిక్కడం లేదు. 2017 నుంచి ఆ షాపు పట్టణానికి చెందిన ఓ ఛార్టర్డ్ అకౌంటెంట్ అధీనంలో ఉందని నిర్ధారణ అయింది. అప్పటి నుంచి షాపు అద్దె డబ్బులు ఎవరికి చేరాయో తెలిసినా బయటకు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సుమారు రూ.3.5 లక్షలు మున్సిపల్ ఖజానాకు చేరకపోవడం వెనుక రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం కూడా వుందని తెలుస్తోంది. మూడు నెలల క్రితం 20 షాపు అద్దె గోల్ మాల్ వ్యవహారం బయటకు వచ్చింది. అధికారపార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లే ఈ బాగోతాన్ని బయట పెట్టారు. ఆ తర్వాత జరిగిన కౌన్సిల్ సమావేశంలో బయటపెట్టిన కౌన్సిలర్లు కమిషనర్ ప్రసన్నవాణిని ప్రశ్నించారు. దీంతో ఆమె విచారణ జరిపిస్తామని చెప్పారు. విచారణకు ఆదేశించి రెండు నెలలయింది. టౌన్ ప్లానింగ్ అధికారి పద్మావతికి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె విచారణ జరిపి నివేదిక అందించారో లేదో తెలియడం లేదు. షాపు అద్దె గోల్ మాల్ బాగోతాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంలో మున్సిపల్ అధికారులు వున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.



వివాదంలో ఉన్న షాపు

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం మొండి వైఖరి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్ సేవలకు బిల్లులు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి వైద్య సేవలను నిలుపుదల చేయనున్నాయి. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ఇప్పటికే ప్రకటించింది. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఉన్న ఆస్పత్రులన్నీ సేవలను నిలుపుదల చేయనున్నట్లు ఆ యూనియన్ తెలిపింది. ఈమేరకు విజయనగరం ఉమ్మడి జిల్లాలో కూడా ఈ సేవలను నిలుపుదల చేయనున్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఇప్పటికే పలుమార్లు ఆస్పత్రుల యాజమాన్యాలు తమ సేవలను నిలుపుదల చేయడం, ప్రభుత్వం బిల్లులు చెల్లించిన తరువాత తిరిగి పునరుద్ధరించడం జరుగుతోంది. తాజాగా ఆరు నెలలుగా ఆస్పత్రులకు బిల్లులు చెల్లించక పోవడంతో ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ తమ సేవలను నిలుపుదల చేయనున్నట్లు ప్రకటించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ 600కు పైబడి ఉన్నాయి. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 16 ఆస్పత్రులు ఉన్నాయి. వీటన్నింటికీ 2023 సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.1500కోట్ల రూపాయలు, విజయనగరం జిల్లాకు సుమారు రూ.70కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. దీంతో యాజమాన్యాలు డబ్బులు రాకపోతే హాస్పిటల్స్‌ను ఎలా నడపాలని, రోగులకు ఎలా సేవాలందించాలని ప్రశ్నిస్తూ సంబంధిత మంత్రిత్వ శాఖకు లేఖ రాశాయి. అయినా స్పందన లేకపోవడంతో సేవలను నిలుపుదల చేయాలని నిర్ణయించాయి. బిల్లులు చెల్లించకపోతే, ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటని యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో పాటు ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు, ప్రైవేటు మెడికల్ కాలేజీలు కూడా సేవలను బంద్ చేయనున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు.



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

నిరంతర నిఘాలో స్ట్రాంగ్ రూములు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర బందోబస్తుతో పర్యవేక్షిస్తున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌తో కలసి ఉద్యాన కళాశాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎంల భద్రతపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇవిఎంలకు మూడంచెల భద్రత కల్పించినట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల తాళాలను, వాటికున్న సీళ్లను, సిసి కెమెరాల పనితీరును క్షుణంగా పరిశీలించారు. మూడంచెల గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్‌డ్, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాన్ని నో ఫ్లై జోన్‌గా ప్రకటించామన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు వరకు స్ట్రాంగ్ రూమ్‌లకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎటువంటి సమన్వయ లోపం రానీయకుండా ప్రత్యేక పోలీస్ అధికారుల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, కంట్రోల్ రూం ఇన్చార్జి, ఎస్డిసి ఆర్‌వి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

విజయనగరంకోట : ఆర్‌టిసిలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపిటిఒ సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి గ్యారేజ్ వద్ద హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 16వ బ్యాచ్ కు ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ సర్టిఫికెట్లు అందజేశారు.

గెలుపు ధీమా... ఓటమి భయం

ప్రజాశక్తి - పాలకొండ

సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే బరిలో ఉన్న వైసిపి అభ్యర్థి కళావతి, జనసేన అభ్యర్థి జయకృష్ణ గెలుపోటములపై అంచనాలు వేసుకున్నా లెక్కలు కుదరడం లేదు. ఓ పక్క గెలుస్తామని ధీమాగా ఉన్నప్పటికీ, లోలోపల ఓటమి భయం ఇరువురిలోనూ వెంటాడుతున్నట్లు వారి అనుచరుల ద్వారా తెలుస్తుంది. 287 పోలింగ్ కేంద్రాల్లో 1,46,781 ఓట్లు నమోదయ్యాయి. అందులో మహిళా ఓట్లు 74,990 మంది కాగా, పురుష ఓట్లు 71,777 నమోదు అయ్యాయి. 14 ఓట్లు ట్రాన్స్ జెండర్స్ నమోదు అయ్యాయి. అయితే మహిళా ఓట్లు తమకు అనుకూలంగా ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు కూడా తమవే అని వైసిపి వర్గీయులు చెబుతున్నాయి. అయినా సీతంపేట, భామిని మండలాల్లో ఓటర్లు ఏ విధమైన తీర్పు ఇచ్చారో తెలియక, లెక్క దొరక్క వైసిపి వర్గీయులు తలలు పట్టుకుంటున్నారు. అయితే జయకృష్ణను మొదటి నుండి వ్యతిరేకిస్తున్న టిడిపి నుంచి ఒక గ్రూపు తమకు అనుకూలంగా పని చేసిందనిఎమ్మెల్యే వర్గీయులు భావిస్తున్నారు. అలాగే జనసేన అభ్యర్థి కూడా కూడికులు, తీసివేతల మధ్య లెక్క కడుతున్నప్పటికీ ఒక అంచనాకు రాలేకపోతున్నట్లు తెలుస్తుంది. కొత్తగా చేరిన 11,000 ఓటర్లలో సుమారు 8000 ఓట్లు తమకే అనుకూలంగా ఉన్నాయని కూటమి వర్గీయులు భావిస్తున్నారు. దీనికి తోడు సూపర్ సిక్స్‌ను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయడం, ఇప్పటికే రెండు సార్లు ఓటమి పాలైన జయకృష్ణపై సానుభూతి కూడా ఉండడంతో తమకు అనుకూలంగా ఉందని కూటమి వర్గీయులు భావిస్తున్నారు. భామిని మండలం ఓటర్లు తమకే అనుకూలంగా తీర్పు ఇస్తారని, సీతంపేటలో వైసిపి మెజారిటీ తగ్గుతుందని వారి వాదన. ఏదేమైనా ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో ఈసారి ఫలితాలుపై పూర్తిగా ఎవరూ స్పష్టత ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదలైతే ఓటర్లు ఎవరికి పట్టం కడతారో తెలియనుంది.

ఘనంగా సిరిమానోత్సవం

దేవాలయాలకు, సిరిమానోత్స వానికి పోటెత్తిన జనం

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి, పాతబొబ్బిలి సరేపొలమ్మతల్లి సిరిమానోత్సవాలు అంబరాన్ని తాకాయి. గొల్లపల్లి, పాతబొబ్బిలి గ్రామదేవత పండుగ సందర్భంగా మంగళవారం దాడితల్లి, సరే పొలమ్మతల్లి సిరిమానోత్సవాలు ఘనంగా జరిగాయి. సిరిమానోత్సవాలను తిలకించేందుకు వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేశారు. దాడితల్లి సిరిమానోత్సవం గొల్లపల్లిలో ప్రారంభం కాగా, ఓంకార్ టాకీస్, మేదరబంద, రెడ్డికవీధి, బజారు, తాండ్రపాపారాయ విగ్రహం, కోట జంక్షన్, వాటర్ ట్యాంక్, రైల్వే జంక్షన్, గాంధీబొమ్మ, కష్టా టాకీస్, రావువారివీధి, గొల్లవీధి మీదుగా గొల్లపల్లి చేరుకుంది. సరేపొలమ్మతల్లి సిరిమానోత్సవం పాతబొబ్బిలి నుంచి ఆకులరెల్లి వీధి, సంఘవీధి, మేదరబంద, బజారు, తాండ్రపాపారాయ విగ్రహం, కోట జంక్షన్, వాటర్ ట్యాంక్ జంక్షన్, రైల్వే జంక్షన్, గాంధీబొమ్మ, ఎన్టీఆర్ బొమ్మ, రామాటాకీస్, జెండావీధి, దావాలవీధి మీదుగా పాతబొబ్బిలి చేరుకుంది. సరే పోలమ్మతల్లి సిరిమానోత్సవాన్ని పూజారి బొబ్బిలి అఖిల్, దాడితల్లి సిరిమానోత్సవాన్ని పూజారి బత్తిన శంకరరావు అధిరోహించారు.

అమ్మవారు, సిరిమానోత్సవాన్ని దర్శించుకున్న ప్రముఖులు

గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి శ్రీసరేపొలమ్మతల్లిను ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, టిడిపి అభ్యర్థి బేబినాయన, మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు దర్శించుకున్నారు. పంటలు బాగా పండాలని, ప్రజలను సుఖసంతోషాలతో చూడాలని ఆకాంక్షించారు.



బొబ్బిలి పురవీధుల్లో ఊరేగుతున్న సిరిమాను

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డిఎస్‌పి జివి కృష్ణారావు అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సిఆర్పిసి 144సెక్షన్ అమలులో ఉందని, కాబట్టి నలుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా తిరిగినా చట్టరీత్యా నేరం అన్నారు. ప్రజలు సమన్వయం పాటించాలని, గొడవలకు వెళ్లరాదని, శాంతియుతంగా ఉండాలని కోరారు. వెనుక నుంచి రెచ్చగొట్టే పనులు చేసినా, కవ్వింపు చర్యలు చేసినా తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. అటువంటి వ్యక్తులను కూడా తాము గుర్తించామన్నారు. పెట్రోల్ బంకులో, పాన్ షాపులో లూస్ పెట్రోల్ విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే, తమకు తెలియజేయాలని కోరారు. గ్రామాల్లో జరుపుకునే ఎటువంటి ఉత్సవాలకు స్టేజి, మైక్, డాన్స్ బేబి డాన్స్ ప్రోగ్రాంలకు అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలను కాపాడడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఎన్నికలల సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించారన్నారు. విలేకరుల సమావేశంలో సిఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

జిందాల్ చర్చలు విఫలం

కొత్తవలస : జిందాల్ కార్మిక సమస్యలపై విజయనగరం డిసిఎల్ వద్ద మంగళవారం యాజమాన్యంతో కార్మిక సంఘాల నాయకులు చేసిన చర్చలు విఫలమయ్యాయి. ఈ చర్చలకు కంపెనీ నుంచి డిజిఎం హెచ్‌ఆర్ గోపాలకృష్ణ, మేనేజర్ సన్యాసినాయుడు పాల్గొనగా, కాంట్రాక్టు వర్కర్స్ నుంచి పి. వెంకటేష్, బి. రామచంద్రరావు, కార్మికుల నుంచి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు నెక్కల నాయుడు బాబు, కె.సురేష్, పిల్ల అప్పలరాజు, ఇతర కార్మికులు పాల్గొన్నారు. చర్చలు విఫలం కావడంతో కార్మికులు వెనుదిరిగారు. గత ఐదు రోజుల నుంచి ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్నప్పటికీ యాజమాన్యం కనీసం స్పందించకుండా వ్యవహరించిన తీరుపై కార్మికులు మండిపడుతున్నారు. వంటావార్పు చేసినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదని ఆగ్రహిస్తున్నారు. కనీసం కార్మికులకు విషయం చెప్పకుండా, లేఆఫ్ ప్రకటించడానికి గల కారణాలేంటని ప్రశ్నిస్తున్నారు. డిసిఎల్ వద్ద జరిగిన చర్చలు ఎటువంటి పురోగతి లేకుండా విఫలమయ్యాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, బొట్ట రాము, నమ్మి చినబాబు, బాలిబోయిన ఈశ్వరరావు, సలాది భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షం నీరు

చినుకు పడితే చిత్తడే

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల కేంద్రంలో వర్షం పడితే చాలు వర్షపు నీరు రోడ్డు మీద నిలబడిపోయి చెరువును తలపించేలా ఉంటుంది. బజారులో రోడ్డుకు ఇరువైపులా కాలువ లేకపోవడంతో వ్యాపారులు రోడ్డుకు ఆనుకొని ఉండడం బజార్లో ఎక్కడకక్కడే గోతులు ఉన్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రయాణికులు పోతున్నారు. ఈ రోడ్డు కోసం గతంలో ఆర్అండ్బి అధికారులకు అనేకమార్లు వినతులు అందజేసినా పట్టించుకునే నాధుడే లేడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న నీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్యామల

కోడ్ పాటిస్తూ మండల సమావేశం

ప్రజాశక్తి - కొమరాడ

మూడు నెలలకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం ఈసారికి ఎన్నికల కోడ్ పాటిస్తూ నిర్వహించినట్టు ఎంపిడిఒ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శెట్టి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మండలం అభివృద్ధిపై కానీ, సంక్షేమ పథకాలు వివరింపుపై కానీ వివిధ తీర్మానాలపైనా ఎటువంటి చర్చ లేకుండా సమావేశాన్ని మామ అనిపించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎటువంటి చర్చలు జరపకుండా సభ్యులు హాజరై సంతకాలు పెట్టి సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యులు డి.లక్ష్మి, వైస్ ఎంపిపిలు శరత్‌బాబు, అన్నపూర్ణ, వివిధ ఎంపిటిసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఏనుగులు కదలవు... అధికారులు పట్టించుకోరు

ప్రజాశక్తి -కొమరాడ

మండలం నుంచి ఏనుగులు కదలవని, అధికారులు, పాలకులు పట్టించుకోరని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 11 ఏనుగులు రైతులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఇక్కడ నుంచి ఏనుగులను తరలించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. ఏనుగుల తరలింపు విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు వెంకటేష్, రామారావు, రామస్వామి పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఎడిఎ రత్నకుమారి

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు 50శాతం రాయితీపై విక్రయించనున్నట్లు, ఆసక్తి గల రైతులు పచ్చిరొట్ట విత్తనాలు పొందాలని పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పనసనందివాడలో రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలానికి 63 క్వింటాల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కిలో రూ.88 పచ్చిరొట్ట విత్తనాలు 50శాతం రాయితీ పోనూ రూ.44కే విక్రయించినట్లు ఆమె తెలిపారు. అలాగే వ్యవసాయాధికారులిచ్చే సూచన, సలహాలు పాటించి పంటలు సాగు చేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారి జక్కున సౌజన్య, విఎఎ బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

యు.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేటలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి డి.అనూష, ఎఎన్ఎం ఎం.సరస్వతి, హెల్త్ సహాయకులు కె.రవికుమార్, ఆశా కార్యకర్త ఆర్.దమయంతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఒరిగిన చెట్టు... పాదాచారుల అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పోలీస్ స్టేషన్ వీధిలో రోడ్డుకు అడ్డంగా ఒరిగిన చెట్టుతో పాదాచారులు, ద్విచక్ర వాహన చోదకులు, నానా అవస్థలు పడుతున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ వీధిలో ఒక ప్రైవేట్ వ్యక్తికి సంబంధించిన ఖాళీ స్థలంలో ఉన్న చెట్టు రోడ్డుకు అడ్డంగా ఒరిగిపోవడంతో, అదే రహదారి గుండా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, దీనితో పాటు పట్టణ పోలీస్ స్టేషన్‌కు విధులకు వచ్చే సిఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంతో ఉన్న సంబంధిత స్థలం యజమానిపై మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడమేమిటని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.



రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు

అభివృద్ధికి ఆమడ దూరాన గిరిజన తండాలు

- అధ్వానంగా రహదారులు
- తాగు నీటి కోసం అవస్థలు
- విద్యకు దూరమవుతున్న గిరి పుత్రులు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి -వీరఘట్టం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావస్తున్నప్పటికీ గిరిజన తండాలు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదంటే పాలకుల పనితీరు ఏ విధంగా ఉందో వీటిని చూస్తే అర్థం చేసుకో వచ్చు. ప్రసంగాలకే పాలకులు పరిమితమవుతున్నారే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ఈ కారణంగా గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు.

మండలంలోని హుస్సేనపురం, కత్తులకవిటి, కంబర, చిన గోరకాలనీ, దశమంతపురం, వండవ, చలివేంద్రి, వీరఘట్టం సచివాలయాల పరిధిలో గల పెద్ద గదబవలస, దువ్వనపాడు, నీలంపేట, కొత్తగూడ, శాంతిగూడ, ఎలీషాపురం, సంధిమానుగూడ, పాలమానుగూడ, రాయి మానుగూడ, వంకాయలగెడ్డ, గంగంపేట, రామాపురం, కె.ఇచ్ఛాపురం, బల్లగుడ్డి, జరడ, కాగితాడ, కొండవానిగోర, మావిడిమానుగోర, గోరకాలనీ, బట్టిగూడ, కొత్తగూడ, గాదిలంక, మూలలంక, పెద్దూరు, సింధు నగర్, శృంగరాయపురం, ఎస్ గోపాలపురం, ఎస్ గోపాలపురంగూడ, అచ్చువలస తదితర గ్రామాలు ఉన్నాయి. వీటిలో బట్టిగూడ, నీలంపేట, కాగితాడ, గదబవలస, సంధిమానగూడ, రాయిమాను గూడ, బల్ల గుడ్డి, రామాపురం, తదితర గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యాల్లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 104, 108 వాహనాలు గ్రామాలకు వచ్చే దాఖలాల్లేవు. అడపాదపా కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్లు చిత్తడి చిత్తడిగా మారుతుండడంతో వీటిపై రాకపోకలు సాగించేందుకు మరిన్ని అవస్థలకు గురవుతున్నామని గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగు నీటి కోసం అవస్థలు

మండలంలోని జరడ, కొత్తగూడ, గాదిలంక, దువ్వనపాడు తదితర గ్రామాల గిరిజనులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కత్తులకవిటి సచివాలయం పరిధిలో కురుపాం మండలం తిక్కర పంచాయతీ జరడకాలనీ నుంచి పది ఏళ్ల కిందట సుమారు 16 కుటుంబాలు వచ్చి జరడ గ్రామంగా ఏర్పాటు చేసుకొని జీవనోపాధి కొనసాగిస్తున్నామని ఎం.గోవింద, ఎ.కేశవరావు, చిన్నారావు, అజాద్, సుందర్రావు,



అధ్వాన్నంగా ఉన్న బట్టిగూడ-నర్సిపురం గ్రామాల మధ్య రహదారి



అర్థాంతరంగా నిలిచిపోయిన కల్వర్టు పనులు

అయ్యన్న, ఎం.సన్నాయి తదితర గిరిజనులు వాపోతున్నారు. రేషన్ కార్డులు, ఆధార్ అన్ని వీరఘట్టం మండలంగా మార్చుకున్నామని, అయినా ఇంత వరకు ఒక ఇల్లు కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రస్తుతం తాము పూరిళ్లలోనే కాలం గడుపుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. గ్రామంలో తాగునీటికి తీవ్ర అవస్థలుపడుతున్నామన్నారు. తమ ఇబ్బందులను క్రిస్టియన్ సంస్థ చెందిన వారు గ్రామంలో బోరు బావి ఏర్పాటు చేశారన్నారు. అయితే ఈ బోరు ద్వారా వచ్చే నీరు కిలుము వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుక్కెడి నీటి కోసం వంకాయలగెడ్డ, కత్తులకవిటి గ్రామాలకు మోటార్ సైకిల్‌కు క్యానల్ కట్టి మంచినీరు తీసుకువచ్చి దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని జరడ గిరిజనులు తెలిపారు. అలాగే బట్టిగూడ గ్రామానికి సమీపంలో కొత్తగూడ గ్రామం ఉన్నప్పటికీ అక్కడ జలజీవన్ మిషన్ పనులు చేసినా వాటి ద్వారా చుక్క నీరు రాకపోవడంతో సమీపానున్న గెడ్డ నుంచి మంచినీళ్లు తోడుకొని దాహార్తిని తీర్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్థాంతరంగా నిలిచిపోయిన కల్వర్టు పనులు

మండలంలోని మూలలంక నుండి బట్టిగూడ, కొత్తగూడ గ్రామాల మీదుగా నర్సిపురానికి అనుసంధానం చేసేందుకు పదేళ్ల కిందట కల్వర్టు పనులు చేపట్టారు. ఇక్కడ పనులు పూర్తి కాకపోవడంతో అధికంగా వర్షాలు కురిస్తే వచ్చే వరదల వల్ల ఆయా గ్రామాలకు సంబంధాలు తెగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు చెబుతున్నారు.

సత్ప్రవర్తనతోనే ఖైదీల్లో మార్పు

జిల్లా జడ్జి బి. సాయికల్యాణ్ చక్రవర్తి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జైలులో ఉండే ఖైదీలకు సత్ప్రవర్తనతోనే మార్పు రావాలని జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. సోమవారం సబ్ జైలును జిల్లా జడ్జి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడుతూ వారికి సరైన ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారో లేదోనని ఆరా తీశారు. మంచి భోజనం, వసతి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కాలం జైల్లో ఎంత మంది ఖైదీలు ఉన్నారు. అలాంటి వారికి ఇప్పటి వరకూ ఎందుకు బెయిల్ రాలేదని జైలు వార్డెన్ మోహన్ బాబును అడిగారు. బెయిల్ కోసం దరఖాస్తు చేయని ఖైదీలు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొన్నిసార్లు క్షణికావేశంలో చేసిన తప్పుకు జైలు జీవితం గడపాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. మీరు జైలులో ఉంటే బయట ఉండే నీ కుటుంబం పరిస్థితి గురించి ఆలోచించారా, అనాలోచిత నిర్ణయాలు మంచివి కాదని బైటకు వచ్చిన తరువాతైనా కుటుంబం కోసం సన్మార్గంలో నడవాలని జిల్లా జడ్జి హితవు పలికారు. ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి జైలు సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా జడ్జి కల్యాణ చక్రవర్తి

కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి పాల్గొన్నారు.



ల్యాబ్‌లోని పరికరాలను పరిశీలిస్తున్న డిఎంఒ జగన్‌మోహనరావు

మలేరియా, డెంగీ పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షా కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ నిర్వహిస్తున్న మలేరియా, డెంగీ జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికల వివరాలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి ఎంఎఫ్7 పక్కగా నిర్వహించాలని ఆదేశించారు. మలేరియా నిర్ధారణకు మైక్రోస్కోప్ పరీక్షా విధానాన్ని ఎక్కువగా అవలంబించాలని ఆదేశించారు. సేకరించిన రక్త పూతల స్లైడ్స్‌ను పరిశీలించారు. కచ్చితమైన ఫలితాల కొరకు స్లైడ్స్‌ను సకాలంలో పరీక్షలు జరపాలన్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షా పరికరాన్ని (ఎలీసా రీడర్) పనిచేస్తున్న తీరును పరిశీలించారు. క్షేత్ర స్థాయి నుంచి డెంగీ తుది నిర్ధారణ కోసం నమూనాలు ఏ మేరకు వస్తున్నాయో ఆరా తీశారు. మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే వెంటనే ఐహెచ్ఐపిలో ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. అనంతరం అక్కడ ల్యాబ్‌లో ట్రైనీ సిబ్బందికి జ్వర నిర్ధారణ పరీక్షలు, మలేరియా, డెంగీ జ్వర లక్షణాలు తదితర అంశాలపై వివరించారు. ఆయన వెంట ఎఎంఒ సూర్యనారాయణ ఉన్నారు.

ఏజెన్సీలో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలోని ధారపాడు, పొంగలంగూడ తదితర గ్రామాల్లో మలేరియా నివారణకు దోమల మందును పిచికారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ గ్రామాల్లో మందును పిచికారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం గ్రామస్తులకు ముందుగా తెలియపర్చి కాలువల్లోనూ, ఇళ్లల్లోనూ దోమల మందును పిచికారీ చేస్తున్నామన్నారు. దీనివల్ల ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు అన్నపూర్ణ, చంద్రహాసన్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోయవద్దు

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

గ్రామాల్లో చికెన్ కొట్టు నిర్వాహకులు వ్యర్థాలను కోళ్ల ఫారాల్లో వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను బహిరంగ ప్రదేశాల్లో పారబోయే వద్దని ఎంపిడిఒ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి బారిన పడి మనుషులు, పశువుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని అన్నారు. ఇటీవల కాలంలో మండలంలో జరిగిన సంఘటనలే అందుకు నిదర్శనమని తెలిపారు. కుక్కలు మనుషులను, పసువులను చంపడం వంటి చర్యలకు పాల్పడడం అవి కేవలం మాంసానికి అలవాటు పడడమేనని తెలిపారు. కావున కోళ్ల ఫారాలు, చికెన్ సెంటర్లు నడుపుతున్న వారు వ్యర్థాలను ఆరు బయట ప్రదేశంలో పారబోయివద్దని ఊరికి దూరంగా మనుషుల సంచారం లేని ప్రదేశంలో గొయ్యి తీసి అందులో కప్పి పెట్టాలని, లేనిచో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై ఎవరైనా వ్యర్థాలను ఆరుబయట పారబోస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ విషయం సంబంధిత గ్రామ కార్యదర్శులకు నోటీసులివ్వాలని సూచించినట్లు ఎంపిడిఒ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

గడ్డి పిక్కల పత్తి నిషేధం

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్రంలో గడ్డిపిక్కల పత్తిపై నిషేధం ఉందని, మార్కెట్లో దీని విక్రయాలు చేపట్టినా, రైతులు సాగు చేసినా తీవ్ర చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడ్డిపిక్కల పత్తి పూర్తిగా నిషేధించబడిందని, ఈ రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈ పత్తి సాగు చేస్తే పర్యావరణానికి హాని కలగడమే కాకుండా అనేక రకాలైన సాగు సమస్యలు ఎదురవ్వడమే కాకుండా జీవావరణ సమతుల్యత దెబ్బతింటుందని, దీన్ని విక్రయించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కావున రైతులు ఎట్టి పరిస్థితుల్లో సాగు చేయకూడదని తెలిపారు. అలాగే గ్లైఫ్ సెట్ కలుపు మందు కూడా వ్యవసాయ పంటల్లో నిషేధించబడిందని, ఈ మందు వాడకం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా మొండి కలుపు తయారయ్యి రాబోయే రోజుల్లో కలుపు నివారణ పెద్ద సమస్యగా మారుతుందని ఈ విషయాన్ని రైతులకు గ్రామస్థాయిలో విరివిగా తెలియజేయాలని తెలిపారు. న

నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలు:

సారవంతమైన సాగుకు నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలు తప్పనిసరిగా చల్లుకుని పూత దశలో కలియదున్నుకోవాలని, అప్పుడే భూమి సారవంతమవుతుందని ప్రకృతి సేద్య సిఆర్పి తిరుపతి నాయుడు అన్నారు. మండలంలోని దిగువశీలలో గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్ కుమార్‌తో కలిసి నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా నవధాన్య పచ్చిరొట్ట విత్తనాల వల్ల కలిగే లాభాలను వివరించి గడ్డి పిక్కల పత్తి పై ఉన్న నిషేధాన్ని రైతులకు తెలియజేస్తూ కరపత్రాలను పంచారు.

ప్లంబింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎపి ఎస్ ఎస్ డి సి ద్వారా నిర్వహిస్తున్న ప్లంబర్ కోర్స్ విద్యార్థులకు స్థానిక భద్రగిరి ఆర్ఐటిఐలో మంగళవారం ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహించారు. 18మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు.



ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశం (ఇన్‌సెట్‌లో రూ.20కు ఇచ్చే టిక్కెట్టు)

రూ.20కు రశీదు... రూ.30 వసూలు

- వాహనాల పార్కింగ్‌కు అడ్డగోలు దోపిడీ
- చోద్యం చూస్తున్న ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న వాహనాల పార్కింగ్‌కు కాంట్రాక్టర్ అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంప్లెక్సు ముందు భాగంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ సౌకర్యం ఉంది. దీని నిర్వహణకు ఆర్టీసీ అధికారులు టెండర్ పద్ధతిన కాంట్రాక్టర్‌ను ఎంపిక చేస్తారు. ఏడాదిన్నరగా ఇక్కడ పార్కింగ్ ఫీజు వసూలులో దోపిడీ జరుగుతున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఒక ద్విచక్ర వాహనం పార్కింగ్‌కు రోజుకు రూ.30 వసూలు చేస్తున్నారు. కానీ రూ.20కు మాత్రమే రశీదు అందిస్తున్నారు. పార్కింగ్ కేంద్రం వద్ద బోర్డులో మాత్రం 12 గంటలకు 20రూపాయలు, 24 గంటలకు 30రూపాయలు అని పేర్కొన్నారు. కానీ రశీదు మాత్రం 20రూపాయలకే పంపిణీ చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొద్దిరోజుల క్రితం ఒక ప్రభుత్వ ఉద్యోగి ఈ వ్యవహారంపై ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. దీనిపై డిఎం భాస్కరరెడ్డిని వివరణ కోరగా రూ.20 వసూలు చేయాలని చెప్పారు. తనకు అందిన ఫిర్యాదుపై కాంట్రాక్టరుకు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మట్టితో బొమ్మల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం ఆరో రోజు డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి పిల్లలకు మట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్పించారు. పర్యావరణం, నీరు కలుషితమవ్వడానికి ముఖ్య కారణం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన బొమ్మలు, వీటి వాడకం వల్ల పర్యావణవేత్తలు చెప్పిన మాటలు, మానవ మనుగడ, జలచరాలు, ప్రాణులు ఈ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన బొమ్మలను వాడడం, వాటి వాడకం ద్వారా కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మనం మట్టితో చేసిన బొమ్మలు తయారుచేసి వాడడం వల్ల కొన్ని తరాలు జీవించడానికి అవుతుంది. ఇందులో చాలా మంది పిల్లలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు స్టోరీ టెల్లింగ్‌లో భాగంగా మంగళవారం అల్లూరి సీతా రామరాజు జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు చదివి వినిపించారు. అలాగే క్రీడా పోటీల్లో భాగంగా చదరంగం, క్యారం బోర్డు తదితర ఆటల పోటీలను నిర్వహించామని శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. అదేవిధంగా



విద్యార్థులకు మట్టితో బొమ్మల తయారీని వివరిస్తున్న డ్రాయింగ్ మాస్టర్ మురళి

ప్రతిరోజు వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సెంచూరియన్ విద్యార్థికి పారితోషికం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం బిబిఎ విద్యార్థి భట్టు ఆదినారాయణకు ఎస్టేట్ ఆఫీసర్ ఎస్.ఎస్.రావు రూ.5వేలు పారితోషికం అందజేశారు. మంగళవారం సాయంత్రం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి తన ఛాంబర్‌లో మాట్లాడుతూ క్రీడాకా రులను ప్రోత్సహించడం అభినందించదగ్గ విషయమన్నారు. కాగా, ఇటీవల అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్‌లో జరిగిన ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆదినారాయణ 81 కిలోల విభాగంలో రజత పతకం సాధించిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రావు మాట్లాడుతూ తాను ఆదినారాయణకు ప్రతి నెల రూ.5వేలు పారితోషికం అందజేస్తానని ప్రకటించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ, కోచ్ అర్జున్ పాల్గొన్నారు.

భువనేశ్వర్ - సోలాపూర్ రైలు 24 గంటలు ఆలస్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

భువనేశ్వర్ టు సోలాపూర్ 01452నెంబరు గల రైలు 24గంటలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈనెల 20న ఉదయం 9.50గంటలకు విజయనగరం రైల్వే స్టేషన్‌కు రావాల్సి ఉండగా మొదట ఎనిమిది గంటలు ఆలస్యంగా నడుస్తుందని ప్రయాణికులకు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రయాణికులంతా 8గంటల అనంతరం స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే ఇక్కడ వీరికి ఎనిమిది గంటలకు కొద్ది సమయం ముందే మరో సమాచారం వారి మొబైల్‌కు వచ్చింది. ప్రయాణికులు ప్రయాణం తొందరపాటులో గమనించలేకపోవడంతో రైల్వేస్టేషన్ రాగానే ట్రైన్ ఎప్పుడు వస్తుందని ఎంక్వయిరీ చేశారు. 24 గంటలు ఆలస్యంగా నడుస్తుందని చెప్పడంతో ఒకసారిగా కంగు తిన్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు స్టేషన్‌లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరికి రైల్వే అధికారులు భోజనం, టిఫిన్ వంటి సౌకర్యాలు అందించకపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు. ట్రైన్ ఉదయం 10 గంటలకు రావడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమైన స్టేషన్‌మాస్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైల్వేట్రాక్ పునరుద్ధరణలో భాగంగా ఈ సమస్య తలెత్తుతుందని అన్నారు. సికింద్రాబాద్ టు అగర్తల వెళ్లే రైలు కూడా 12 గంటలు ఆలస్యంగా నడుస్తుందన్నారు.